

# గ్రామసభల్లో ఆందోళనలు

| జిల్లా | మండలం | గ్రామం |
|---|---|---|
| **ఆదిలాబాద్** | | |
| మంచిర్యాల | భీమారం | పోలంపల్లి, ఎల్కేశ్వరం |
| | జన్నారం | తపాలాపూర్ |
| | చెన్నూర్ | వార్డు నంబర్ 17 |
| ఆదిలాబాద్ | బోథ్ | కనుగుట్ట |
| | బజార్‌హత్నూర్ | బజార్‌హత్నూర్ |
| ఆసిఫాబాద్ | రెబ్బెన | రెబ్బెన |
| ఆసిఫాబాద్ | చింతలమానేపల్లి | బూరెపెల్లి |
| నిర్మల్ | సోన్ | కడ్తాల్ |
| నిర్మల్ | ముథోల్ | ఏడ్బిడ్ |
| **రంగారెడ్డి** | | |
| వికారాబాద్ | చేవెళ్ల | ముడిమ్యాల్ |
| | ఇబ్రహీంపట్నం | చర్లపటేల్‌గూడ |
| | మంచాల | లింగంపల్లి |
| వికారాబాద్ | పెద్దేముల్ | పెద్దేముల్ |
| జనగాం | కొడంగల్ | పోచమ్మతండా |
| **నిజామాబాద్** | | |
| | కమ్మర్‌పల్లి | కమ్మర్‌పల్లి |
| | కమ్మర్‌పల్లి | అమీర్‌నగర్ |
| | మోర్తాడ్ | తిమ్మాపూర్ |
| | బోధన్ | శక్కర్‌నగర్ |
| | బోధన్ | కల్దుర్కి |
| | బోధన్ | పెడగాపల్లి |
| | సాలూర | జాడిజమాల్‌పూర్ |
| | సాలూర | సాలంపాడ్ |
| | ఆర్మూర్ | మూడో వార్డు |
| | మాక్లూర్ | అమ్రాద్ |
| | మాక్లూర్ | మామిడిపల్లి |
| | డిచ్‌పల్లి | నడిపల్లి |
| | ధర్పల్లి | దుబ్బాక |
| | ధర్పల్లి | రామడుడు |
| | చందూర్ | ఖరేగావ్ |
| | బాల్కొండ | వన్నెల్ (బి) |
| | నిజామాబాద్ | గుండారం |
| | నిజామాబాద్ టౌన్ | 7వ వార్డు |
| కామారెడ్డి | గాంధారి | గాంధారి |
| | నాగిరెడ్డిపేట | వదలపర్తి |
| | పెద్దకొడప్‌గల్ | బేగంపూర్ |
| | బాన్సువాడ | ఇబ్రహీంపేట్ |
| **మెదక్** | | |
| సంగారెడ్డి | పుల్కల్ | పుల్కల్ |
| | గుమ్మడిదల | గుమ్మడిదల |
| | | అన్నారం |
| | | బొంతపల్లి |
| | | దోమడుగు |
| | | కొత్తపల్లి, అనంతారం |
| | జిన్నారం | మంగంపేట |
| | న్యాల్‌కల్ | ఖలీల్‌పూర్ |
| | ఝరాసంగం | మాచునూరు |
| | | నర్సాపురం |
| | నారాయణఖేడ్ | ర్యాకల్ |
| | | సిర్గాపూర్, చీమలపాడ్ |
| సిద్దిపేట | నంగునూరు | పాలమాకుల |
| | బెజ్జంకి | లక్ష్మీపూర్ |
| **వరంగల్** | | |
| జయశంకర్ భూపాలపల్లి | చిట్యాల | చిట్యాల |
| | కాటారం | కాటారం |
| | మహదేవపూర్ | బ్రాహ్మణపల్లి |
| హనుమకొండ | శాయంపేట | నేరేడుపల్లి |
| | కమలాపూర్ | గూడూరు |
| | ధర్మసాగర్ | ధర్మసాగర్, తాటికాయల |
| జనగామ | లింగాలఘనపురం | లింగాలఘనపురం |
| | జనగామ | పెంబర్తి |
| | జఫర్‌గఢ్ | జఫర్‌గఢ్, కూనూరు |
| | పాలకుర్తి | అయ్యంగారిపల్లి |
| | | కొండాపూర్ |
| మహబూబాబాద్ | కురవి | కురవి |
| | ఇనుగుర్తి | కోమటిపల్లి |
| | కేసముద్రం | కేసముద్రం విలేజీ |
| | డోర్నకల్ | గొల్లచర్ల |
| | తొర్రూరు | చింతలపల్లి |
| | నర్సింహులపేట | నర్సింహులపేట |
| | చిన్నగూడూరు | గుండంరాజుపల్లి |
| | పెద్దవంగర | బొమ్మకల్లు |
| ములుగు | వాజేడు | జగన్నాథపురం |
| వరంగల్ | నర్సంపేట | నర్సంపేట 1వ వార్డు |
| | చెన్నారావుపేట | చెన్నారావుపేట |
| | ఖానాపురం | బుధరావుపేట, అశోక్‌నగర్ |
| | సంగెం | గవిచర్ల |
| **కరీంనగర్** | | |
| పెద్దపల్లి | పెద్దపల్లి | బొంపల్లి |
| | ధర్మారం | కమ్మర్‌ఖాన్‌పేట |
| రాజన్న సిరిసిల్ల | సిరిసిల్ల | 5వ వార్డు |
| | బోయినపల్లి | రత్నంపేట |
| | గన్నేరువరం | చొక్కారావుపల్లి |
| | వీర్నపల్లి | వీర్నపల్లి |
| | సారంగాపూర్ | బట్టపల్లి |
| | రుద్రంగి | గైరిగుట్టతాండా |
| పెద్దపల్లి | ఓదెల | భీమరపల్లి |
| | కాల్వశ్రీరాంపూర్ | పందిల్ల |
| | జూలపల్లి | అబ్బాపూర్ |

| జిల్లా | మండలం | గ్రామం |
|---|---|---|
| **ఖమ్మం** | | |
| ఖమ్మం | ఖమ్మం సిటీ | బల్లేపల్లి |
| | ఖమ్మం రూరల్ | తీర్థాల |
| | బోనకల్లు | బ్రాహ్మణపల్లి |
| | ముదిగొండ | వెంకటాపురం |
| | మధిర | ఇల్లూరు |
| | కల్లూరు | కల్లూరు |
| | వేంసూరు | కుంచపర్తి |
| | కొణిజర్ల | తీగలబంజర |
| | కారేపల్లి | కారేపల్లి |
| | కూసుమంచి | గట్టుసింగారం |
| | తిరుమలాయపాలెం | పిండిప్రోలు |
| భద్రాద్రి | చుంచుపల్లి | రాంపురం |
| | జూలూరుపాడు | గాంధీనగర్ |
| | లక్ష్మీదేవిపల్లి | బొజ్జలగూడెం |
| | పాల్వంచ | పాల్వంచ |
| | పాల్వంచ | కేశ్వాపురం |
| | కొత్తగూడెం | కొత్తగూడెం |
| | అశ్వారావుపేట | దిబ్బగూడెం |
| | అన్నపురెడ్డిపల్లి | అబ్బుగూడెం |
| | చండ్రుగొండ | మద్దుకూరు |
| | దమ్మపేట | అల్లిపల్లి |
| | దుమ్ముగూడెం | గంగోలు |
| | టేకులపల్లి | కొత్తతండా |
| | పినపాక | తోగ్గూడెం |
| **మహబూబ్‌నగర్** | | |
| జోగుళాంబ గద్వాల | వడ్డేపల్లి | జిల్లెడుదిన్నె |
| | ఇటిక్యాల | పెద్దదిన్నె |
| మహబూబ్‌నగర్ | నవాబ్‌పేట | ఇప్పటూరులో |
| | మిడ్జిల్ | వెలుగోములలో |
| నాగర్‌కర్నూల్ | వంగూరు | రంగాపూర్, కోనేటిపూర్‌లో |
| నాగర్‌కర్నూల్ | కొల్లాపూర్ | కొల్లాపూర్ 4వ వార్డులో |
| | పదర | ఉడిమిళ్లలో |
| నారాయణపేట | మరికల్ | రాకొండలో |
| వనపర్తి | అమరచింత | ఈర్లదిన్నె |
| | పాన్‌గల్ | అన్నారం |
| **నల్లగొండ** | | |
| నల్లగొండ | మునుగోడు | మండల కేంద్రం |
| | త్రిపురాం | మండల కేంద్రం |
| | పీఏపల్లి | అంగడిపేట |
| | మిర్యాలగూడ | మున్సిపాలిటీ |
| | చిట్యాల | ఎలికట్టె |
| | చిట్యాల | ఏపూరు |
| | చండూరు | మున్సిపాలిటీ |
| | నల్లగొండ | కంచనపల్లిలో |
| | కట్టంగూరు | పిట్టంపల్లి |
| | నార్కట్‌పల్లి | చెర్వుగట్టులో |
| | కనగల్ | మండల కేంద్రం |
| | శాలిగౌరారం | చిత్తలూరు, వంగమర్తి |
| | నకిరేకల్ | ఓగోడు, నడిగూడెం, నోముల |
| సూర్యాపేట | సూర్యాపేట | 1వ వార్డు |
| | తిరుమలగిరి | 4వార్డు |
| | కోదాడ | గుడిబండ |
| | మునగాల | నారాయణగూడెం |
| | మోతె మండలం | సిరికొండ |
| | ఆత్మకూర్.ఎస్ | నెమ్మికల్ |
| యాదాద్రి భువనగిరి | మోత్కూరు | దాచారం, అనాజిపురం |
| | బీబీనగర్ | రాయరావుపేట, రహీంఖాన్‌పేట, గుర్రాలదండి |



మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చింతలపల్లి గ్రామసభలో అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

# దద్దరిల్లె ఊరు

మొదటిపేజీ తరువాయి...

నిలదీశారు. ఏ గ్రామ సభలో చూసినా సర్కార్‌పై ప్రజలు తమలో నిండిపోయిన తీవ్ర అసంతృప్తిని వెల్లగక్కారు. 'దరఖాస్తులు ఎప్పుడు తీసుకున్నారు? ఏ ప్రాతిపదికన అర్హుల జాబితా తయారు చేశారు. మాకు ఎందుకు ఇవ్వరు?' అని ఎక్కడికక్కడ నిలదీయడంతో అధికారులు మధ్యలోనే వదిలేసి వెళ్లిపోయారు. జాబితాలో మొత్తం కాంగ్రెస్ కార్యకర్తలు, నేతల పేర్లే ఉన్నాయంటూ అనేకచోట్ల అధికారులు, నేతలు, ప్రజల మధ్య వాగ్వాదం జరిగింది. మంచిర్యాల, సూర్యాపేట, నల్లగొండ, రంగారెడ్డి, యాదాద్రి భువనగిరి, మేడ్చల్ మల్కాజిగిరి, జనగామ తదితర జిల్లాల్లోని పలు గ్రామాల్లో అధికారులపై ప్రజలు మూకుమ్మడిగా తిరగబడడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది. రాజన్నసిరిసిల్ల జిల్లాలో గుంట భూమిలేకున్నా ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు ఎందుకివ్వడంలేదని మహిళలు నిలదీశారు. ఆరు గ్యారెంటీల అమలు ఏమైందని, ఆడబిడ్డలకు తులం బంగారం ఏదని? ఏడాదైనా రైతుభరోసా ఎందుకిస్తలేరని? ప్రశ్నల వర్షం కురిపించారు.

## పాత దరఖాస్తులేమైనయ్?

నాలుగు పథకాలకు కొత్తగా దరఖాస్తులు ఇవ్వాలంటూ అధికారులు పత్రాలు విడుదల చేయడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాపాలనలో దరఖాస్తులు ఇచ్చామని, కులగణన సర్వేలో కూడా తమ వివరాలన్నీ చెప్పామని, తమకు సంబంధించిన అన్ని రకాల వివరాలు ప్రభుత్వం దగ్గర ఉన్నాయని స్పష్టంచేశారు. మళ్లీ ఇప్పుడు ఎందుకు దరఖాస్తులు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. గతంలో ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని నిలదీశారు. ఓట్లప్పుడు చెప్పినదానికి, ఇప్పుడు చేస్తున్నదానికి పొంతన లేదని అధికార పార్టీ నేతలపై నిప్పులు చెరిగారు. మార్పు అంటే ఇదేనా అని దెప్పిపొడిచారు.

- సోమవారం జరిగిన గ్రామసభల్లో ప్రజల నిలదీతలతో ప్రభుత్వం అప్రమత్తమైంది. మంగళవారం గ్రామసభలను పోలీసు పహారా మధ్య నిర్వహించారు. ప్రజలు ప్రశ్నిస్తారని, నిలదీస్తారన్న భయంతోనే సభల వద్ద పోలీసులను కాపలా పెట్టారన్న విమర్శలు వచ్చాయి.
- చాలాచోట్ల ప్రజాపాలన దరఖాస్తులు సరిపడా లేక.. ప్రజలు జిరాక్స్‌ల కోసం పరుగులు తీయడం కనిపించింది. ఒక్కో దరఖాస్తు ఫారాన్ని రూ.30 వరకు పెట్టి కొన్నట్లు దరఖాస్తుదారులు తెలిపారు.
- మంచిర్యాల జిల్లా భీమారం మండలం పోలంపల్లిలో సొంత కార్యకర్తలే కాంగ్రెస్ పార్టీ పథకాల అమలుపై నిలదీశారు.
- కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా వాంకిడి మండలంలోని బంబార గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల అర్హుల జాబితాలో నిరుపేద కుటుంబానికి చెందిన ఒంటరి మహిళ నూతి జ్యోతి తన పేరు లేకపోవటంతో గ్రామసభలో కన్నీరు పెట్టుకున్నది. పూరిగుడిసెలో కొడుకుతో ఒంటరిగా ఉంటూ కూలీ పనులు చేసుకునే తనకు ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు మంజూరు కాలేదని ఆవేదన వ్యక్తం చేసింది.
- రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోల్ నియోజకవర్గంలోని పుల్కల్ మండల కేంద్రంలో గ్రామసభ ప్రారంభించిన కొద్దిసేపటికే ముగిసింది. ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తులు ఏమయ్యాయని ప్రజలు నిలదీయడంతో చేసేదేమీ లేక అధికారులు మధ్యలోనే వెళ్లిపోయారు. దీంతో పారిశుధ్య కార్మికుడు యాదయ్య, సిబ్బంది దరఖాస్తులు స్వీకరించారు.
- ఖమ్మం నగరంలోని మూడో డివిజన్ బల్లేపల్లిలో ఇందిరమ్మ ఇల్లు జాబితాలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఉండడంతో స్థానికులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. సభకు హాజరైన ప్రతేకాధికారి నిర్లక్ష్యపు సమాధానం చెప్పడంతో వివాదం కాస్త పెద్దదైంది. పోలీసుల జోక్యంతో సద్దుమణిగింది.
- తమ గ్రామాన్ని కార్పొరేషన్ పరిధిలో కలపొద్దని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం మంగపేట గ్రామస్తులు డిమాండ్ చేశారు. పంచాయతీలో నిర్వహించిన గ్రామసభను అడ్డుకున్నారు. 'పల్లెలే ముద్దు.. కార్పొరేషన్ వద్దు' అంటూ నినాదాలు చేశారు.
- కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం చొక్కారావుపల్లిలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతుండగా మహిళలు రుణమాఫీపై ప్రశ్నించారు. త్వరలోనే చేస్తామని ఆయనదాటవేత సమాధానం ఇచ్చారు.
- రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండల కేంద్రంలో డబుల్ రోడ్డు విస్తరణలో 24 మంది ఇండ్లు కోల్పోగా, వారిలో ఏడుగురికే పరిహారం వచ్చింది. మిగిలిన 17 మంది పేర్లు ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో లేకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారులు సమాధానం చెప్పలేక దాటవేసే ప్రయత్నం చేశారు. అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌తోనూ స్థానికులు వాగ్వాదానికి దిగడంతో ఆయన అక్కడి నుంచి వెళ్లిపోయారు.
- జగిత్యాల జిల్లా సారంగాపూర్ మండలం బట్టపల్లిలో ఆత్మీయ భరోసాలో ఒక్క కుటుంబానికి చెందిన వారి పేర్లే అధికంగా ఉన్నాయని గ్రామస్తులు, కూలీలు అభ్యంతరం వ్యక్తం చేశారు.
- నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండలం ఉడిమిళ్ల గ్రామసభలో ప్రభుత్వ పథకాల్లో చెంచులు, మాదిగలకు ప్రాధాన్యం ఇవ్వడం లేదని, ప్రభుత్వం తయారు చేసిన లిస్టులో మాదిగ వర్గానికి చెందిన ఒక్క పేరు కూడా లేకపోవడం ఏమిటని అధికారులను నిలదీశారు. కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసిన వారిలో మాదిగలు లేరా.. లేక మాదిగలంతా ధనికులుగా ఉన్నారని సర్వేలో తేలిందా? ఆ సర్వే ఎవరు చేశారు? ఈ లిస్టు ఎవరు తయారు చేశారో చెప్పాలని డిమాండ్ చేస్తూ సభను అడ్డుకున్నారు.
- నారాయణపేట జిల్లా మరికల్ మండలం రాకొండలో ఒకే కుటుంబంలో రెండు మూడు ఇండ్లు వచ్చాయని అన్నీ ఇచ్చిన వారికే ఇస్తే ఇక సభలు ఎందుకని ప్రజలు అడ్డుకున్నారు.
- వనపర్తి జిల్లా అమరచింత మండలం ఈర్లదిన్నెలో రైతు శివారెడ్డి తనకు రూ.లక్షా 60 వేల రుణమాఫీ కాలేదని నిలదీయగా మద్దతుగా చాలా మంది రైతులు కూడా లేచి తమకు కూడా రుణమాఫీ కాలేదని, అధికారులు సమాధానం చెప్పాలని ఎదురుతిరిగారు.
- యాదాద్రి భువనగిరి జిల్లా గుర్రాలదండిలో ఆత్మీయ భరోసా పథకంలో 20 మంది పేర్లు ఎంపిక చేస్తే అందులో ప్రభుత్వ ఉద్యోగితో పాటు భూములు ఉన్న వారి పేర్లే ఉన్నాయని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. రాజాపేట మండలంలోని రేణికుంటలో విదేశాల్లో ఉండే వ్యక్తికి రేషన్ కార్డు జాబితాలో పేరు వచ్చిందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.
- నల్లగొండ జిల్లా నకిరేకల్ మండలం మోదినిగూడెంలో గ్రామసభను గ్రామస్తులు బహిష్కరించారు. ఉదయం 9:30 నుంచి 10.30 వరకు పంచాయతీ కార్యాలయానికి గేటు వేసి నిరసన తెలిపారు. అధికారులు చేసేదేమీ లేక పంచాయతీ ఆవరణలోనే కూర్చున్నారు.

## దరఖాస్తులు తీసుకోకుండానే..

భువనగిరి పట్టణంలోని 7వ వార్డు హనుమాన్‌వాడలో రేషన్‌కార్డు, ఇండ్ల కోసం డబ్బులు పెట్టి ఫారం కొనుక్కొని గంటల తరబడి లైన్‌లో నిలబడి వేచిచూసిన కొందరికి నిరాశే ఎదురైంది. సమయం అయిపోయిందని చెప్పి వారి దరఖాస్తులను అధికారులు తీసుకోకుండానే వెళ్లిపోయారు. అన్నం కూడా తినకుండా ఇక్కడే నిలుచున్నా దరఖాస్తులు తీసుకోలేదని వారంతా ఆవేదన వ్యక్తంచేశారు.



రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ముడిమ్యాల్ గ్రామ సభ మధ్యలో కలుగజేసుకొని మాట్లాడుతున్న చేవెళ్ల ఎస్సై సంతోష్ రెడ్డి

## ఎక్కువ మాట్లాడితే లోపలేస్తం

రంగారెడ్డి జిల్లా చేవెళ్ల మండలం ముడిమ్యాల గ్రామంలో ఓ ఎస్సై అత్యుత్సాహం ప్రదర్శించాడు. గ్రామసభలో అర్హుల ఎంపిక సరిగ్గా లేదని ఓ యువకుడు ప్రశ్నిస్తుండగా ఎస్సై సంతోష్‌రెడ్డి కలగచేసుకుని 'వీడు ఎక్కువ మాట్లాడుతున్నడు.. తీస్కపోయి లోపలేయండి' అంటూ సిబ్బందికి హుకుం జారీ చేశాడు. పోలీసుల ఓవరాక్షన్‌పై ఓ విలేకరి వీడియో తీస్తుండగా, అతడి ఫోన్ లాక్కొని దాడిచేసే ప్రయత్నం చేశారు. ఎస్సై దురుసు ప్రవర్తనను గ్రామస్తులు తప్పుపట్టారు. తమ గోడును వినిపించుకోకుండా తమపైనే దురుసుగా ప్రవర్తించటమేమిటని నిలదీశారు.

## తప్పుతాగి లిస్ట్ తయారు చేసిండ్రు

- ఇంటింటికీ తిరిగి సర్వే చేయలేదు
- అధికారుల తీరుపై కాంగ్రెస్ ఇనుగుర్తి మండల అధ్యక్షుడి మండిపాటు



మహబూబాబాద్, జనవరి 21 : 'రెండేండ్ల కింద చనిపోయినవారి పేర్లు, కోటీశ్వరుల పేర్లు జాబితాలో ఉన్నయ్. మొత్తం పేదలకు అన్యాయం చేసేటట్టు జాబితా తయారు చేసింద్రు.. కార్యదర్శి, జీపీ సిబ్బంది తప్పుతాగి ఇంట్లో ఉండి రాసుకున్న లిస్ట్ ఇది. ఇంటింటికీ తిరిగి సర్వే చేయలేయనే లేదు.. మళ్లీ గ్రామంలో రీ సర్వే చేసి అర్హులకు న్యాయం చెయ్యాలె' అంటూ అధికారుల తీరుపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిప్పులు చెరిగారు. మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం కోమటిపల్లి సభలో ఇందిరమ్మ ఇంటి జాబితా చూసి కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కూరెల్లి సతీశ్ తీవ్రంగా ఆగ్రహం వ్యక్తంచేశారు. కోమటిపల్లికి చెందిన చెరుకు సంజీవ, మంకు యాకయ్య, మటత్తమ్మల్ అలివేలమ్మ ఏడాదిన్నర క్రితమే చనిపోయారని, వారి పేరిట కూడా ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో పేర్లు ఉన్నాయని, స్పెషల్ ఆఫీసర్, కార్యదర్శి, జీపీ సిబ్బంది నిర్లక్ష్యమే ఇందుకు కారణమని నిలదీశారు. వీరిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు.



కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం జక్కల్‌దాని తండా గ్రామసభ వద్ద పోలీసుల మోహరింపు

## దేశ్‌ముఖ్ వంశస్థురాలికి ఇందిరమ్మ ఇల్లు

ఆమె ఒక దేశ్‌ముఖ్ వంశస్థురాలు.. నేటికీ లింగాలఘనపురంలో వారికి ఓ గడీ ఉన్నది. అందులో ఇటీవలే పర్ణశాలను తలపించేలా ఇల్లు నిర్మించుకున్నది. ఆమె కూడా ఇందిరమ్మ ఇల్లుకు అర్హురాలని జనగామ జిల్లా లింగాలఘనపురం గ్రామసభలో అధికారులు ప్రకటించడంతో గ్రామస్తులు విస్తుపోయారు. లింగాలఘనపురానికి చెందిన లింగాల సింధూ ఇందిరమ్మ ఇంటికి అర్హురాలని అధికారులు తేల్చేశారు. ఈ విషయంపై తహసీల్దార్ రవీందర్‌ను వివరణ కోరగా 'లింగాల సింధూ నాకు బాగా తెలుసు.. వారికి ఇందిరమ్మ ఇల్లు వచ్చిందా?' అంటూ ఆశ్చర్యపోయారు.

## లిస్టులో ఉన్నోళ్లందరికీ వచ్చినట్టు కాదు

మంచిర్యాల జిల్లా జన్నారం మండలం తపాలాపూర్‌లో ఆర్‌ఐ గంగారాజాకు, గ్రామస్తులకు తీవ్ర వాగ్వాదం జరిగింది. ఆర్‌ఐ మాట్లాడుతూ 'ఇందిరమ్మ ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ఇప్పుడే మొదలైంది. జాబితాలో పేర్లు వచ్చినోళ్లందరికీ వచ్చినట్టు కాదు. పేర్లు లేనోళ్లకు రానట్టు కాదు. ఇది కేవలం మొన్న చేసిన సమగ్ర సర్వే ప్రకారం వచ్చిన డాటా.. ఎవరిదైనా మిస్ అయ్యింది కావచ్చు. వందల పేర్లలో ఒక పేరు మిస్ అవ్వుద్ది. దీంతో అంతా అయిపోయినట్టు కాదు.' అని నిర్లక్ష్యంగా సమాధానం ఇవ్వడంతో గ్రామస్థులు మండిపడ్డారు. 'మళ్లీ అప్లికేషన్ పెట్టుకునేందుకు పైసలెవరు ఇస్తరు? పని చేసుకుంటూ బతికేటోళ్లం. ఇప్పటికే ఎన్నోసార్లు దరఖాస్తు చేసుకున్నం. మళ్లెందుకు దరఖాస్తు?' అంటూ నిలదీశారు.

## కాల్మొక్త మేడం.. ఇల్లివ్వుండ్రి

కమాన్‌పూర్ ఎంపీడీవో లలిత కాళ్లపై పడి ఓ మహిళ తనకు ఇల్లు కావాలని వేడుకున్నది. పెంచికల్‌పేటకు చెందిన గెల్లేన లావణ్య, శేఖర్ దంపతులది నిరుపేద కుటుంబం. లావణ్య కూలీ పనిచేస్తేనే ఇల్లు గడుస్తుంది. వీరికి ఇద్దరు పిల్లలు. లోతట్టు ప్రాంతంలో ఉన్న రేకుల షెడ్డులో ఉంటున్నారు. వానకాలం వస్తే వీరికి జాగారమే. ఇంట్లోకి నీళ్లు చేరుతయి. దీంతో గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో తల దాచుకుంటరు. ప్రజాపాలనలో ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్న లలిత, తమకు ఇల్లు వస్తదని సంబురపడ్డది. కానీ జాబితాలో ఆమె పేరు రాకపోవడంతో కన్నీరుమున్నీరైంది. తనకు ఎలాగైనా ఇల్లు ఇప్పించాలని ఎంపీడీవో కాళ్లపై పడి వేడుకున్నది.

## కేసీఆర్ ఇచ్చినయన్న ఇత్తలేరు

'కేసీఆర్ ఇచ్చినయన్న ఇత్తలేరు. బాకీ మాఫీ చేస్తమన్నరు.. చెయ్యలేదు' అని నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో నిర్వహించిన గ్రామసభలో మహిళా రైతు ఏలేటి లింగుబాయి ఆవేదన వ్యక్తం చేసింది. రుణమాఫీ వచ్చిందికదా? అని అక్కడే ఉన్న ఓ కాంగ్రెస్ నాయకుడు అడుగగా 'లిస్టు ఉన్నదిగద సూడుపో' అంటూ ఆమె తీవ్ర అసహనం వ్యక్తంచేసింది.